క్లుప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేసిన మున్సిపల్ నోడల్ అధికారి సుజాత

సామర్లకోట: ప్రతి ఒక్కరూ శిక్షణపై పూర్తి బాధ్యతతో వ్యవహరించి సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ నోడల్ అధికారి సీహెచ్ సుజాత సచివాలయ కార్యదర్శులకు సూచించారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలలోని సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఫ్యాకల్టీ శ్రీకైలాస్ శిక్షణ నిర్వహించగా మున్సిపాలిటీల నోడల్ అధికారులు యు.జ్యోతిరామ్, ఎస్వీ రామారావు, కె.శ్రీనివాసరావు, కేపీ ప్రసన్న పాల్గొన్నారు. అనంతరం కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు.

మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు హారతి భర్త మృతి



ప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దొరబాబు

పెద్దాపురం: మండల మాజీ జెడ్పీటీసీ నలజర్ల హారతి భర్త కట్టమూరు మాజీ ఉప సర్పంచ్ నలజర్ల ప్రసాద్ మంగళవారం మృతి చెందారు. మరణవార్త విన్న వెంటనే ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లల గోవింద సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, పెంటా విజయ్‌కుమార్, మాదిరెడ్డి సత్తిబాబు, బిక్కిన శ్రీనివాస్, లక్కాకుల కృష్ణ తదితరులు ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతుల పరికరాలకు శిబిరం



శిబిరంలో మాట్లాడుతున్న ఏడీ రామ్‌కుమార్

కాకినాడ రూరల్: వాకలపూడిలో ఉమా మనోవికాస కేంద్రం వద్ద కోల్‌కతాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శారీరక, బధిర విభిన్న ప్రతిభావంతులకు సహాయ వస్తు పరికరాలు అందించేందుకు గుర్తింపు శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. అక్కడకు వచ్చిన విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాలను, పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకొమోటర్ డిజెబిలిటీస్ కోల్‌కత్త డిప్యూటీ డైరెక్టర్ లంకె ప్రసన్న మాట్లాడుతూ భారత ప్రభుత్వ సామాజిక, న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ఆర్థిక సహకారంతో ఈ పరికరాలు అందిస్తున్నామన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రామ్‌కుమార్, ఉమా మనో వికాస కేంద్రం ఈడీ ఎస్పీ రెడ్డి దివ్యాంగులకు అవసమయ్యే ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు తదితరమైనవి అందిస్తామన్నారు. డాక్టర్ గంగాధరరావు, అమర్ బిస్వాస్, డాక్టర్ దీప్ మిశ్రా, అనూప్ గోష, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ్ బృందానికి ప్రథమ బహుమతి

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో ఋషిపీఠం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మూడు రోజులుగా 'శివపదం' పేరుతో నిర్వహిస్తున్న కళాపోటీలు మంగళవారంతో ముగిసాయి. సామవేదం షణ్ముఖ శర్మ స్వరపరిచిన శివకీర్తనలకు అనుగుణంగా బృందాలు చక్కని హావభావాలతో నృత్య ప్రదర్శనలు ఇచ్చాయి. ఈ పోటీలలో ప్రొద్దుటూరుకు చెందిన శ్రావణ్ కుమార్ బృందానికి ప్రథమ బహుమతి, హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ ప్రసన్న బృందానికి ద్వితీయ బహుమతి, స్థానిక నృత్యాంజలి బృందానికి తృతీయ బహుమతి లభించాయి. సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, ట్రస్టు కన్వీనర్ చావలి రామ్మూర్తి, పసుమర్తి శ్రీనివాసశర్మ, హేమచందర్, టిక్కు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

కాకినాడ: అరుణాచలం గిరిప్రదక్షిణ చేసే ప్రయాణికుల సౌకర్యార్థం కాకినాడ– అరుణాచలం మధ్య ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు మంగళవారం ఇక్కడి నుంచి బయలుదేరింది. కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి దర్శనం అనంతరం సెప్టెంబర్ ఒకటో తేదీ రాత్రికి కాకినాడ చేరుకుంటుందని మనోహర్ చెప్పారు. కాకినాడ డిపో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గోతులు తవ్వి నీతులు చెప్తారా..?

- తాటిపర్తిలో టీడీపీ జనసేన శవ రాజకీయాలు
- ఐదేళ్ల పాటు చెరువులో నీరు–చెట్టు పేరుతో అక్రమ తవ్వకాలు
- టీడీపీ నేతలు తవ్వినప్పుడు నోరు మెదపని జనసేన



2018లో టీడీపీ అక్రమ చెరువు తవ్వకాలను అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నేత దాసం వెంకటేష్ తదితరులు

పిఠాపురం: దొంగే దొంగా దొంగా అని అరిచినట్టు అన్న చందంగా ఉంది పిఠాపురం టీడీపీ నేతల తీరు. దున్న పోతు ఈనింది అంటే దూడను కట్టేయండన్న చందంగా ఉంది జనసేన నేతల తీరు. ఇటీవల పిఠాపురంలో మురికి కాలువలో మట్టి తెచ్చి మున్సిపాలిటీలో వేసి కుళ్లు రాజకీయాలు చేసిన టీడీపీ ఇప్పుడు చెరువులో పడి మృతి చెందిన వ్యక్తి శవంతో శవ రాజకీయాలకు తెరలేపారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. టీడీపీ హయాంలో అధికారంలో ఉన్నంత సేపు ఒక్క రోజు కూడా వదలకుండా చెరువులను నీరు–చెట్టు పేరుతో రూ.కోట్ల విలువైన మట్టిని తవ్వేసుకున్నా ఒక్క జనసేన నాయకుడు కూడా అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. కాని ఇప్పుడు మాత్రం ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే టీడీపీ, జనసేన నేతలకు చెరువు తవ్వకాలు గుర్తొచ్చాయా అంటున్నారు స్థానికులు. ప్రతిపక్షాలుగా బాధితుడికి తమ వంతు సాయం చేసి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చేయాలి తప్ప ప్రభుత్వంపై బురదజల్లడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

గొల్లప్రోలు మండలం తాటిపర్తి కోదండ రామ చెరువులో రెండు రోజుల క్రితం ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదావశాత్తు కాలు జారి చెరువులో పడిపోయడని బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా అర్హతను బట్టి బాధిత కుటుంబానికి సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అధికారులను ఆదేశించారు. దీనిపై అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టారు.

బురద జల్లడానికే..


వ్యక్తి మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సంఘటన స్థలానికి చేరుకుని చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు చేయడం వల్లే వ్యక్తి మృతి చెందాడని అతని మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆవేశంగా ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. ఇలాంటి వాటికి తామేమి తక్కువ కాదని నిరూపిస్తు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉదయ్ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ విమర్శల్లో బాధితుడికి న్యాయం చేయడం కంటే ప్రభుత్వంపై బురద జల్లడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు రెండు పార్టీల నేతలు. బాధితుడి కుటుంబానికి సాయం చేయకుండా గాలికొదిలేసిన ఆ నేతలపై స్థానికులు మండిపడుతున్నారు.

నీరు లేదు చెట్టు లేదు అంతా మట్టే..

టీడీపీ హయాంలో నీరు–చెట్టు పేరుతో ఎక్కడ చెరువు ఉన్నా వదిలిపెట్టలేదు. నిబంధనలు అసలు పట్టించుకోలేదు. ఐదు నుంచి 15 మీటర్ల లోతు వరకు చెరువులను తవ్వి రూ.కోట్ల విలువైన మట్టిని తరలించుకుపోయారు. అప్పట్లో గొల్లప్రోలు మండలం తాటిపర్తి కోదండ రామ చెరువులో టీడీపీ నేతలు మట్టి తవ్వకాలు ఇష్టారాజ్యంగా జరుపుతుంటే స్థానికులు తీవ్ర ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. గ్రామస్తులు తమ గ్రామంలో చెరువును అక్రమంగా తవ్వేస్తున్నారని గ్రామానికి ఒక్క లారీ మట్టి కూడా ఇవ్వడం లేదని జిల్లా ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదు.

అప్పుడు ఏం చేశారు?

టీడీపీ నేతలు తవ్వినప్పుడు నోరు మెదపని జనసేన తగుదునమ్మా అంటూ ఇప్పుడు మాత్రం గొంతు చించుకుని మరీ ఆందోళనకు దిగడంపై ఆ పార్టీ నేతలే ముక్కుమీద వేలేసుకుంటున్నారు. ఐదేళ్లు టీడీపీ నేతలు తవ్వుకున్నప్పుడు నోరు మెదపని జనసేన నేతలు ఇప్పుడెలా ఆందోళన చేస్తారంటు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చెరువులో ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందితే అది ప్రభుత్వం బాధ్యత అంటే ఎలా అంటున్నారు. ఒక వేళ చెరువు తవ్వడం వల్లే ప్రమాదం జరిగి ఉంటే ఇప్పుడు ప్రభుత్వానిది ఎంత బాధ్యతో అప్పుడు అక్రమంగా మట్టి తవ్విన టీడీపీ నేతలది బాధ్యత అనేది గుర్తుంచుకోవాలంటున్నారు. కేవలం తాము ఏదో చేశామని చెప్పుకోడానికి తప్ప బాధిత కుటుంబానికి న్యాయం చేయడానికి మాత్రం కాదని టీడీపీ జనసేన నేతల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.



టీడీపీ హయాంలో తాటిపర్తి చెరువులో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై స్థానికులు కాకినాడ ఆర్డీకి ఇచ్చిన ఫిర్యాదు

ఇళ్ల స్థలాల జాబితాపై విచారణ

కొత్తపల్లి: నాగులపల్లి గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల జాబితాపై మంగళవారం తాళ్లరేవు ఎమ్మార్వో పోతురాజు ఆధ్వర్యంలో పది మంది గ్రామ రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించారు. నాగులాపల్లి గ్రామంలోని ఇచ్చిన ఇళ్ల స్థలాల జాబితాలో అనర్హులు ఉన్నారని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్టు తహసీల్దారు ప్రసాద్ తెలిపారు.

ఇళ్ల స్థలాలపై కరపత్రం ఆవిష్కరణ

పెద్దాపురం: ఏటిపట్టులోని 11 గ్రామాల ప్రజలకు సంబంధించి ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం, అధికారుల తీసుకున్న నిర్ణయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ సీపీఎం మంగళవారం కరపత్రాన్ని విడుదల చేసింది. పార్టీ మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ ఆయా గ్రామాల లబ్ధిదారులతో కలసి ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని, సీఎం దృష్టికి తీసుకువెళ్లాతామన్నారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. రూరల్ కార్యదర్శి కేదారి నాగు, దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయునికి దొరబాబు పూజలు

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద మార్కండేయ స్వామి ఆలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పూజలు చేశారు. భక్తుల సహకారంతో ఆలయం అభివృద్ధి పనులు చేస్తున్నారు. టీటీడీ ద్వారా ఆలయం అభివృద్ధికి నిధులు విడుదల చేయించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'

- హౌసింగ్ చైర్మన్ దవులూరి
- మహిళలకు నమూనా చెక్కు పంపిణీ



మహిళా వ్యాపారులకు నమూనా చెక్కును అందజేసిన దొరబాబు తదితరులు

సామర్లకోట: రోడ్డు మార్జిన్‌లో చిరు వ్యాపారాలు చేసుకునే వారికి జగనన్న తోడు ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి లబ్ధిదారులతో స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉచిత వడ్డీతో అందిస్తున్న రూ.10వేలను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులకు సకాలంలో వాయిదాలు చెల్లించడం ద్వారా ఎటువంటి హామీ లేకుండా రూ.50 వేల వరకు రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికీ మేలు చేయాలనే ఆలోచనతో ఉన్న సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలన్నారు. సామర్లకోటలో జగనన్న కాలనీ ప్రారంభించడానికి సీఎం వస్తున్నారని, ఆయనను ఆశీర్వదించడానికి ప్రతి ఒక్కరూ వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులకు నమూనా చెక్కును దొరబాబు అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తదితరులు మాట్లాడుతూ దవులూరి దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత అధ్యక్షత వహించగా వైస్‌చైర్మన్లు, ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్రరావు, పితాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే నూరుశాతం పూర్తి

- ఈఆర్ఓ జితేంద్ర



వివిధ పార్టీల ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జితేంద్ర

పెద్దాపురం: నియోజకవర్గంలో చేపట్టిన ఓటర్ల రీ సర్వే నూరు శాతం పూర్తి అయినట్లు ఈఆర్వో, తహసీల్దార్ వజ్రపు జితేంద్ర అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటరు సర్వేపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవో జేఎస్ రామారావు మాట్లాడుతూ ఫారం–6కు 652 దరఖాస్తులు, ఫారం–7కు 746 దరఖాస్తులు, ఫారం–8కి 196 దరఖాస్తులు అందాయన్నారు. దీనికి సంబధించి పూర్తి విచారణ, రీ సర్వేలో భాగంగా 94,075 గృహాలను నూరు శాతం ఇంటింటికి వెళ్లి సర్వే పూర్తి చేసినట్లు జితేంద్ర తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు (వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ) ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు.మంగళవారం గుడివాడ, పులిమేరు దమ్ముపేట ప్రాంతంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, గుడివాడ సర్పంచ్ కనపర్తి సీమదొర, సచివాలయ సిబ్బందితో కలసి గడపగడపను సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి



హరీష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు అన్నారు. వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాషువా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన క్రీడాకారులను సత్కరించారు. కాకినాడకు చెందిన హరీష్ స్పోర్ట్స్ తలాటం హరీష్ పాఠశాలలో యోగా, క్రీడా పెయింటింగ్ కోసం రూ.25వేలు అందించిన సందర్భంగా తనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శ , రావు అక్షయ్, గ్రామ సర్పంచి పాలాని దొరబాబు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కూటారావు తదితరులు పాల్గొన్నారు.

కేసీబీఎస్‌లో వైద్య శిబిరం

కాకినాడ: కేసీబీఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సంస్థ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సూర్యారావుపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆర్థోపెడిక్, సాధారణ వైద్య సేవలకు పరీక్షలు చేశారు. మెడికవర్ గ్రూప్ వైద్యులు డాక్టర్ వసంత కుమార్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ శ్రీనిజ వైద్య సేవలు అందించారు. కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. రానున్న రోజుల్లో సంస్థ సేవలను మరింత విస్తృతం చేస్తామని సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్ అన్నారు. కేసీబీఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయం పాత ప్రాంగణంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. పోలీస్ సిబ్బంది, వారి పిల్లల ప్రయోజనార్థం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను సమకూర్చినట్లు తెలిపారు. ఏఆర్ అదనపు ఎస్పీ సత్యనారాయణ, సెబ్ అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల అద్దె పెంపుపై గరంగరం

- కమిషనర్‌పై కౌన్సిల్ సభ్యుల ధ్వజం
- నిర్ణయం తీసుకునే వరకు అంశం వాయిదా
- పలు సమస్యలను చర్చించిన సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంగతాయారు

పెద్దాపురం: పెద్దాపురం పురపాలక సంఘ సాధారణ సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. షాపింగ్ కాంప్లెక్సుల అద్దె విషయంలో కౌన్సిల్ తీర్మానం లేకుండా అధికారులు అన్ని షాపులకు ఒకే అద్దె నిర్ణయించడంపై కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, విడదాసరి రాజా తదితరులు కమిషనర్ సురేంద్రపై ధ్వజమెత్తారు. సభ్యులు నిర్ణయం తీసుకునే వరకు ఈ అంశాన్ని వాయిదా వేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ కోరడంతో చైర్‌పర్సన్ 2, 3 అంశాలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ పట్టణంలోని ప్రధాన రహదారి పైపులైన్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, రాజా, వీర్రాఘవులు, పప్పల దుర్గారావు దర్గా సెంటర్‌లోని హైటెక్ బస్టాండ్‌ను తొలగించి ఏరియా ఆసుపత్రి ఎదుట పెడితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని సూచించారు. ఈ మేరకు బస్టాండ్‌ను తరలించాలని వైస్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. మేనేజర్ జ్యోతిరాణి, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆయా విభాగాల అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక సాగర్‌లో నిమజ్జనాలకు అనుమతించాలి

బోట్‌క్లబ్: ఈ ఏడాది గణేశ నిమజ్జనోత్సవం వినాయక సాగర్‌లో అనుమతించాలని నగర గణేశ ఉత్సవ సమితి డిమాండ్ చేసింది. మంగళవారం నగర గణేశ ఉత్సవ సమితి సమావేశం అధ్యక్షులు దువ్వూరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 18 నుంచి 26 వరకూ నవరాత్రి ఉత్సవాలు, సెప్టెంబర్ 27, 28 తేదీల్లో నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. సమితి కన్వీనర్‌గా వై.మాలకొండయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడ రూరల్‌లో సమితి కార్యదర్శి రంభాల వేంకటేశ్వరావు ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సభ్యులు దూసర్లపూడి రమణరాజు, కేవీ రాఘవులు, ఉంగరాల సుబ్బారావు, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

సోదరుల అనురాగానికి ప్రతీక రాఖీ పండుగ



కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన రాఖీ స్టాల్



చెట్టుకు పూసిన రాఖీ పువ్వు

కొత్తపల్లి: సోదరుల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్. శ్రావణ పౌర్ణమి రోజున జరుపుకొనే రాఖీ పండగకు సోదర, సోదరీమణులందరూ సిద్ధమయ్యారు. సోదరుడికి దీర్ఘాయుస్సు, తన అభివృద్ధిని కోరుకుంటా సోదరి ఈ రాఖీని చేతికి కట్టడం ఆనవాయితీ వస్తోంది. రఖీ కట్టించుకున్న సోదరులు ఆడపడుచులకు పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు, పలు రకాల బహుమతులను అందజేస్తారు. ఈ పండుగను పురస్కరించుకుని మండలంలో రాఖీల విక్రయాల దుకాణాలు కళకళలాడుతున్నాయి. మార్కెట్లో రూ.10 నుంచి రూ.200 వరకు విలువ చేసే రాఖీలను విక్రయిస్తున్నారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్లకు సబ్సిడీ మంజూరు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ సిటీ: చేపలు, రొయ్యల తలసరి వినియోగాన్ని పెంచేందుకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఫిష్ ఆంధ్రా యూనిట్లకు సబ్సిడీ మంజూరు చేస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ సత్యనారాయణ తెలిపారు. రాజమహేంద్రవరంలో త్వరలో జరగబోయే సీ ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించి పోస్టర్లను పాడిపరిశ్రమ, మత్స్య శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జాయింట్ కలెక్టర్ ఇలక్కియలతో కలసి మంగళవారం కలెక్టరేట్‌లోని విధానగౌతమి హాలులో ఆవిష్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు విజయవాడ, నెల్లూరుల్లో ఈ ఫెస్టివల్‌ను నిర్వహించినట్లు వివరించారు. ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంయుక్తంగా రాజమహేంద్రవరంలోని మంజీర సరోవర్‌లో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్లు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామర్లకోట: తెలుగు భాషా దినోత్సవాన్ని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ హాజరై మాట్లాడుతూ మాతృభాషలో పట్టు సాధించడం ద్వారా ఇతర భాషల సాధన సులువవుతుందన్నారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలను వివరించారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్, తెలుగు తల్లి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. పీడీ తాళ్లూరి వైకుంఠం, తెలుగు పండితులు బి.శ్రీలక్ష్మి, జి.బేబీరాణి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో..

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ తెలుగు భాషకు వన్నె తెచ్చేందుకు గిడుగు కృషి ఎనలేనిదన్నారు. తొలుత రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈ ఆదినారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పిఠాపురంలో...

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాహిత్య పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. వివరవలోని ప్రభుత్వ పాఠశాలలో సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించారు.